క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరం

మెంటాడ(గజపతినగరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిరుపేద రోగులకు వరమని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు అనూప్‌రాయ్ అన్నారు. గజపతినగరం మండలం ఎం.కొత్తవలస సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 72 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందజేశారు.

ఈ-క్రాప్ నమోదుకు నేడే ఆఖరు

గంట్యాడ: రైతులు ఈనెల 30లోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామరావు సూచించారు. మండలంలోని నరవ రైతుభరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రతీ రైతు ఈ-క్రాప్ చేయించుకోవాలని, అప్పుడే పంటను విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వారం రోజుల్లో యూరియా వస్తుందని, దాన్ని ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తామన్నారు. ఆయన వెంట ఏఓ బి.శ్యామ్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌ల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎన్‌వీకే దుర్గాప్రసాద్ మండల స్థాయి అధికారులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ప్రతీ సచివాలయం పరిధిలో నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీసీఎస్‌ఎన్ ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణకరరావు, ఏఓ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

కొట్యాడలో 'నా మట్టి-నా దేశం'

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నా మట్టి-నా దేశం' కార్యక్రమాన్ని హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులకు నివాళులర్పించారు. అలాగే వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తుల జీవిత విశేషాలను, దేశంలోని సంస్కృతులు, సంప్రదాయాలు, కళలు, ఆచారాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

గజపతినగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం అక్టోబర్ 5న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గజపతినగరంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభకు పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలంతా కలసికట్టుగా పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం నేతలు రాకోటి రాములు, తంటిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే..

దత్తిరాజేరు: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దేవర ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం దత్తిరాజేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కొత్తగా ప్రవాస్ యోజన పేరుతో అధ్యక్షులను నియమించిందని, వారితో కలిసి గ్రామాల్లో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చినచామలాపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం ఇన్‌చార్జ్ బండి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ఇనుముల సింహాచలం, నియోజకవర్గ నాయకులు సరిది దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

శృంగవరపుకోట: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పట్టణంలోని వివేకానంద విద్యాసంస్థల్లో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ వైద్యులు సుధన్, నారజ్, రాజేష్ గుండె జబ్బులు, సీపీఆర్ థెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

ప్రభుత్వ కళాశాలలో తనిఖీలు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ డా.పోలా భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులకు టీఎల్‌పీ, ఇంటర్న్ షిప్, క్యాంపస్ నియామకాలపై చర్చించారు. కళాశాల పరిసరాలు, తరగతులు, ఇతర మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సింగిల్ మేజర్ సబ్జెక్ట్ ప్రయోజనాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సి.హెచ్.కేశవరావు, లెక్చరర్లు వాసుదేవరావు, షేక్ వలీఖాన్, స్వామినాయుడు, భాస్కర్‌రావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

- జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్
- నేటి నుంచి గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి కె.రాజ్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమం అమలుకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమాచారం సేకరించడం జరిగిందన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఈ నెల 30 నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతారని చెప్పారు. ఇప్పటికే నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అధికార బృందాలు ఆయా గ్రామాల్లో పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమం అమలు విషయంలో అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఈఓ రాజ్‌కుమార్

కొత్తవలసలో..

కొత్తవలస: నేటి నుంచి గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ శుక్రవారం తెలిపారు. ముందుగా మండలంలోని ముసిరాం గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. నలుగురు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లచే వైద్య పరీక్షలు, మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరం ఏర్పాట్లపై వైద్య సిబ్బందితో పాటు ముసిరాం సచివాలయ సిబ్బందితో సమీక్షించారు.

ఎల్.కోటలో..

లక్కవరపుకోట మండలంలోని చందులూరు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

వేపాడలో..

వేపాడ: గ్రామాల్లో నేటి నుంచి చేపట్టే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎంపీడీఓ బీఎస్‌ఎన్ కూర్మనాథ్ పట్నాయక్ శుక్రవారం వెల్లడించారు. సెప్టెంబర్ 30న రామస్వామిపేట, అక్టోబర్ 3న కొండగంగుబూడి, 4న సోంపురం, 5న పాటూరు, 6న ఆతవ, 7న బల్లంకి, 9న బానాది, 10న దబ్బిరాజుపేట, 11న జాకేరు, 12న కుమ్మపల్లి, 13న నల్లబిల్లి, 16న నీలకంఠరాజపురం, 17న శింగరాయి, 18న వల్లంపూడి, 19న వావిలపాడు, 20న వీలుపర్తి సచివాలయాల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

జగనన్న సురక్షపై సమీక్ష

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 30 నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో సచివాలయ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సురక్ష షెడ్యూల్‌ను వెల్లడించారు. ముందుగా ముచ్చర్ల గ్రామంలో కార్యక్రమం చేపట్టనున్నందున ఆ సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం రోగులు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు.


మెంటాడ(గజపతినగరం రూరల్): సురక్ష కార్యక్రమంపై కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

నేడు చుక్కవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కొండశంబాం గ్రామ సచివాలయం పరిధిలోని చుక్కవలస గ్రామంలో శనివారం ఉదయం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ జి.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని వెల్లడించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మండలస్థాయి ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఏర్పాట్లు పూర్తి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. నిపుణులైన వైద్యులు ఇక్కడకు వచ్చి ఆరోగ్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: మండలంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల షెడ్యూల్‌ను ఎంపీడీఓ శేషుబాబు శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 30న గోపాలపల్లి, అక్టోబర్ 3న ఎస్.కోట-1, 4న సంతగవిరమ్మపేట, 5న ధర్మవరం, 6న ఎస్.కోట-2, 7న ఆలుగుబిల్లి, 9న పెదఖండేపల్లి, 10న మామిడిపల్లి, 11న ఎస్.కోట-3, 12న ఎస్.కోట-5, 13న పోతనాపల్లి, 16న తిమిడి, 17న వెంకటరమణపేట, 18న వీరనారాయణం, 19న కొత్తూరు, 20న ధారపర్తి, 21న ఎస్.కోట-4, 25న ఎస్.కోట తలారి, 26న భర్తాపురం ఎస్టీ కాలనీ, 27న ముషిడిపల్లి, 28న మూలబొడ్డవర గ్రామాల్లో వైద్య శిబిరాలు ఉంటాయన్నారు.

సీటీయూపై తప్పుడు కథనాలు సరికాదు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



దత్తిరాజేరు: మెంటాడ మండలం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల మధ్య నిర్మిస్తున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీపై ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు రాయడం సరికాదని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 25 ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి శంకుస్థాపన చేసిన దీనిపై టీడీపీ తోక పత్రిక ఓర్వలేక తప్పుడు కథనాలు రాసిందని మండిపడ్డారు. వర్సిటీ నిర్మాణానికి కావాల్సిన 591.91 ఎకరాలు భూమి కోసం దత్తిరాజేరు-మెంటాడ రెవెన్యూ అధికారులు సేకరించారన్నారు. 440 మంది రైతులకు రూ.28,79,18,680లు చెల్లిస్తే.. ఏదో అవినీతి జరిగిందని రాయడం సరికాదన్నారు. భూసేకరణ సమయంలో ఉప తహసీల్దార్ ఎఫ్‌ఏసీ బాధ్యతలు ఇవ్వడం వల్లే ఆయన సేకరించారని, అందులో ఎలాంటి తప్పులేదని, అధికారులు తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు.

వేడుకగా 'స్వచ్ఛతాహీ సేవా'

చీపురుపల్లి: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా అమలు చేస్తున్న 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమాన్ని చీపురుపల్లి మండలంలో ఓ వేడుకలా నిర్వహించుకుందామని జిల్లా పరిషత్ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి కె.రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. అక్టోబర్ 1న మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రమదాన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. చీపురుపల్లి పట్టణంలోని వంగపల్లిపేటలో ఉదయం 10.30 గంటలకు జరగనున్న శ్రమదానం కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ జీఎస్ నిర్మలాదేవి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమం వివరాలు వెల్లడిస్తున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

పొడ తెగులుపై అప్రమత్తం

బొండపల్లి: వరి పంటకు ప్రస్తుతం పొడ తెగులు ఎక్కువగా ఆశిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్, స్వాతి, గజపతినగరం సబ్‌డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ సూచించారు. మండలంలోని నెలివాడ గ్రామంలోని వరి పొలాలను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. పొడ తెగులు లక్షణాలు, తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. హెక్సాక్రోనోజోల్ మందును 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ప్రోపినోక్రోనోజోల్ మందును 1మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే తెగులు పూర్తిగా తగ్గేంత వరకు నత్రజని(యూరియాను) వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

జామి: మండలంలోని కుమరాం కల్యాణ్‌నగర్‌లో ఉన్న ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి దివ్యసన్నిధిలో శుక్రవారం స్వామివారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో 99 శాతానికి పైగా హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. పేదలు, రైతులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా తీర్చిదిద్దిందన్నారు. గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, పార్టీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, సర్పంచ్ ఎర్రా రామసత్యవతి, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, వైస్ సర్పంచ్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్లు దుల్ల పూర్ణకుమారి, హరిబాబు, నాయకులు ఎం.సత్యనారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టరు పద్మావతి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జెసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ముచ్చర్లలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో శనివారం ఉదయం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిశోర్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఈ కార్యక్రమానికి హాజరవుతున్నందున మండలంలోని అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

6న మండల సమావేశం

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో అక్టోబర్ 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులందరికీ సమాచారం అందించడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

మండల సమాఖ్యకు జాతీయ స్థాయి అవార్డు

గంట్యాడ: మండల సమాఖ్యకు వరుసగా రెండో ఏడాది జాతీయ స్థాయి అవార్డు లభించింది. 2022-23 సంవత్సరంలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరినందుకు మండల సమాఖ్యకు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన, అత్యంత అభివృద్ధి చెందుతున్న కేటగిరిలో ఈ అవార్డు లభించింది. అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో ఎం.హెచ్.ఆర్.డి వద్ద జరిగే ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందజేయనున్నారు. మండల సమాఖ్య సభ్యులకు, వెలుగు సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి అభినందనలు తెలియజేశారు.

మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట: పట్టణంలో స్థానిక ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శుక్రవారం మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ పి.శ్రీరాములు మాట్లాడుతూ 12 పాఠశాలల నుంచి 90 మంది క్రీడాకారులు హాజరైనట్లు చెప్పారు. అండర్-14, 19 విభాగాల్లో బాలబాలికలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

జామి: ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలని బ్రహ్మకుమారీస్ సంస్థల సంయుక్త సంచాలకులు సంతోష్ దీదీజీ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన దివ్యఅనుభూతి భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరిరూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. అధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విజయగనరం జిల్లా ఇన్‌చార్జ్ బి.అన్నపూర్ణ, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

కషాయాల వినియోగంతో మంచి ఫలితాలు

కొత్తవలస: మండలంలోని గులివిందాడ గ్రామ సంఘ ఆధ్వర్యంలో మహిళా రైతులకు పంచపత్ర కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జామ, వేప, జిల్లేడు, సీతాఫలం, మునగ ఆకులతో ఈ కషాయాన్ని ఎలా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఎఫ్‌పీఓ ఎ.వెంకటరమణ మాట్లాడుతూ.. వరి పంటను ఆశించే వివిధ రకాల తెలుగుళ్ల నివారణకు రసాయన మందులకు బదులు ప్రకృతి వ్యవసాయ విధానంలో తయారు చేసిన కషాయాలను వినియోగించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఓఏ ఎర్రమ్మ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కోమలత పాల్గొన్నారు.

పలుపత్ర ద్రావణం వరికి సర్వరోగ నివారిణి

బొండపల్లి: వివిధ రకాల మొక్కల ఆకులతో చేసిన పలుపత్ర కషాయం వరిపంటను ఆశించే అన్ని రకాల తెగుళ్లకు సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ ఎం.రామకృష్ణ అన్నారు. మండలంలోని వెదురువాడలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 21 రకాల ఆకులను ఉపయోగించి పలుపత్ర కషాయం ఏవిధంగా తయారు చేసుకోవాలో రైతులకు వివరించారు.


కొత్తవలస: కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వైఎస్సార్‌సీపీలో 15 కుటుంబాలు చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని డొంకాడ గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అప్పలనరసయ్య పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో లగుడు సత్యనారాయణ, రెడ్డి సత్యం, లగుడు అప్పలనాయుడు, లగుడు కృష్ణ, రాయవరపు అప్పలనాయుడు, గొట్లాపు కన్నం నాయుడు, గొట్టాపు అప్పలనాయుడు, లగుడు సత్యారావు, సీర రామప్పుడు, సీర రమణ తదితలు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, పార్టీ నాయకులు కర్రి సాంబ, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

బొండపల్లి: రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు అన్నారు. మండలంలోని కనిమెరక గ్రామానికి చెందిన కనిరెడ్డి సత్యవతికి పీఎంఈజీపీ క్రింద మగ్గం వర్క్ మిషన్ కొనుగోలుకు మంజూరైన రూ.5 లక్షలు చెక్కును శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అందచేశారు. లక్షకు రూ.35 వేలు చొప్పున రాయితీ లభిస్తుందన్నారు. ఈ రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కె.సులోచనాదేవి పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

బొండపల్లి: కొత్తగా ఎంపికైన వలంటీర్లు తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు అన్నారు. వెదురువాడ, గొల్లుపాలెం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుకు ఎంపికైన వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, గొల్లుపాలెం వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ బిల్లు ప్రతుల దహనం

శృంగవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం జీపీఎస్(గ్యారంటీ పెన్షన్ స్కీం) బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎస్ నాయకులు ఎ.రాము, జి.గణేష్‌నాయుడు, పి.ఎస్.మూర్తి, కె.కృష్ణ, ఎన్.వెంకటరమణ, ఎం.తులసీరామ్, టి.రవికుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుమారు 50 మంది వరకూ పాల్గొని బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గణపతి లడ్డూ వేలం

వేపాడ: మండలంలో బల్లంకి గ్రామంలో వినాయక మండపం వద్ద శుక్రవారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన గళ్ల సత్తిబాబు రూ.13 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. పురోహితుడు మేడపాటి కిశోర్ శర్మ సత్తిబాబుకు లడ్డూను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రజారోగ్యాన్ని కాపాడడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సన్మానించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. పంచాయతీ పరిధిలో సేవలందిస్తున్న 53 మంది కార్మికులకు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పద్మజ, ఈఓపీఆర్డీ డి.ధర్మారావు, పంచాయతీ మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ తదితరులు